

పెనుకొండ పట్టణంలోని దర్గాసర్కిల్‌లో మురుగు కాలువ దుస్థితి

పల్లె, పట్నంలో తాండవిస్తున్న అపరిశుభ్రత
కాలువల్లో ముందుకు కదలని మురుగు
దిబ్బలుగా చెత్త
శుభ్రంచేసే నాథుడు కరువు
వ్యాధుల బారిన జనం



వామ్మో.. దోమ..!



హిందూపురంలోని ఎన్‌జీఓ కాలనీలో ఇళ్ల మధ్యలో పాచిపట్టిన నీరు, ముళ్లకంపలు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 30: గత వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీ పాలన ఎన్నడూలేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం పైసా కూడా నిధులివ్వలేదు. కేంద్రం ఇచ్చిన నిధులను కూడా లాగేసుకుంది. వీధిదీపాలు లేక పల్లెలు అంధకారంలో ఉండిపోయాయి. కాలువలు మురుగుతో నిండిపోయాయి. శుభ్రం చేసే కార్మికులకు వేతనాలిచ్చే పరిస్థితి లేదు. పల్లెపట్నం అన్న తేడాలేకుండా ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దిబ్బలుగా పేరుకుపోయాయి. కాలువల్లో నిండిపోయిన మురుగును, చెత్త దిబ్బలపై దోమలు వ్యాప్తి చెందాయి. వాటి గూడును కదిలించేవారు లేకపోవడంతో విపరీతంగా పెరిగిపోయాయి. జనాన్ని కాటేస్తూ.. రక్తాన్ని పిండేస్తున్నాయి. వాటి దెబ్బకు సీజనల్ వ్యాధులు విపరీతంగా వ్యాపిస్తున్నాయి. ఆస్పత్రులకు జ్వర బాధితులు క్యూ కడుతున్నారు. పలువురు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ఊళ్లు మంచంపట్టాయి. ప్రధానంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో జనం విలవిల్లాడుతున్నారు.

గత వైసీపీ ప్రభుత్వ విధానాలతోనే..

గత వైసీపీ ప్రభుత్వం ప్రజారోగ్యంపై శీతకన్ను వేయడమే ఈదుస్థితికి కారణమనే గుసగుసలు వినపడుతున్నాయి. పారిశుధ్యంపై శ్రద్ధ చూపకపోవడం, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రభుత్వమే నిధులను దారి మళ్లించింది. తద్వారా పల్లె పట్టణాలు అనేతేడాలేకుండా పారిశుధ్యం లోపించి, దోమలు పెరిగిపోయాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పేరుకే జిల్లా కేంద్రం

జిల్లాకేంద్రంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. దోమల నివారణకు సంబంధించి వర్షాకాలంలో చేయాల్సిన ఫాగింగ్‌కు పూర్తిగా పాతరేశారు. గత సంవత్సరం సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో రెండుమూడురోజులు మాత్రమే ఫాగింగ్ చేసిన మున్సిపల్ అధికారులు తర్వాత ఫాగింగ్ మిషన్లను మూలనపడేశారు. జిల్లాకేంద్రం పేరుకే తప్ప.. పారిశుధ్యంపై ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడంపై పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. మున్సిపల్ కార్యాలయానికి కుడి, ఎడమవైపు రహదారుల్లో మురికికాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి, కంపుకొడుతున్నాయి. దోమలకు ఆవాసాలుగా మారాయి. అయినా.. మున్సిపల్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. గత టీడీపీ హయాంలో మురికి కాలువలపై ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలను ఆధునికీకరణ పేరుతో తీసివేసి వాటిని ఓపెన్ డ్రైన్లుగా మార్చిన ఘనత మున్సిపల్ అధికారులదేనని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం పక్కనే పందులు స్వైరవిహారం చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేడు.

ఎంత ఖర్చు చేశారో..?

ధర్మవరం మున్సిపాలిటీలో రెండేళ్లుగా అడపాదడపా ఫాగింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎంతమేర నిధులు ఖర్చు చేశారనే విషయంపై అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా దాటవేస్తున్నారు. ఉన్న రెండు పాత ఫాగింగ్ మిషన్లతోనే నెట్టుకొస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

దోమల స్వైరవిహారం

కదిరి పట్టణంలో దోమల నివారణకు గత రెండేళ్లలో ఫాగింగ్ నిమిత్తం రూ.పది లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో మలాథీన్, ఫాగింగ్ మిషన్ డీజిల్‌కు ఖర్చుచేసినట్లు వారు చెబుతున్నా.. దోమల స్వైరవిహారం మాత్రం ఆగడంలేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పారిశుధ్యం కూడా అంతంత మాత్రమే ఉంటుండటంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.

మురుగునీటి చెరువులు

హిందూపురంలో ఏటా దోమల నివారణకు లక్షల రూపాయలు ఖర్చుచేస్తున్నారు. ఫాగింగ్ మురికిగుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయడం, స్ప్రేయర్లు, దోమల నివారణకు కరపత్రాలు, అవగాహన సదస్సులకు లెక్కలు చూపుతున్నారు. భారీమొత్తంలో నిధులు ఖర్చుచేస్తున్నా మురుగునీరు చెరువులను తలపిస్తోంది.

నియంత్రణకు ప్రత్యేక చర్యలు



జిల్లాలో దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలతోపాటు వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. పంచాయతీ, మున్సిపల్, గ్రామీణ నీటిసరఫరా తదితరశాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

- డాక్టర్ మంజువాణి, జిల్లావైద్యాధికారి

నేడే పింఛన్

ఉదయం 6 గంటల నుంచే పంపిణీ



ధర్మవరం, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లను ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు అందజేయనుంది. ప్రతినెలా ఒకటో తేదీన ప్రభుత్వం పింఛన్ సొమ్ము అందిస్తోంది. సెప్టెంబరు నెలకు సంబంధించిన సొమ్మును ఒకరోజు ముందుగా శనివారమే లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం శుక్రవారమే పూర్తి చేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో మొత్తం 2,68,079 పింఛన్లు ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం రూ.115 కోట్లు విడుదల చేసింది. వృద్ధాప్య 145519, వితంతువు 53956, దివ్యాంగులు 35682, చేనేత 12,662, ఒంటరి మహిళ 6469, అభయ హస్తం 4522, డప్పు కళాకారులు 4388, మత్స్యకారులు 705, తలసేమియా 104, హిజ్రా 65 పింఛన్లు ఉన్నాయి. శనివారం అందుబాటులోలేని పింఛన్‌దారులకు సోమవారం ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సోమవారం నాటికి వందశాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పింఛన్ల పంపిణీకి తగినంత మంది సచివాలయ సిబ్బంది లేకపోవడంతో ఇతర శాఖల ఉద్యోగులను కూడా కేటాయించారు. వీరు శనివారం ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయనున్నారు.

పసిరోదన..!

హిందూపురం ఆస్పత్రిలో చిన్నారుల తిప్పలు
మంచానికి ఇద్దరు, ముగ్గురు..


ఒకే మంచంపై ముగ్గురు చిన్నారులు


ఒకే మంచంపై ఇద్దరు చిన్నారులను ఉంచి చికిత్స


రోగులతో కిటకిటలాడుతున్న చిన్న పిల్లల వార్డు

హిందూపురం అర్బన్, ఆగస్టు 30: చిన్నారులు సీజనల్ వ్యాధుల బారిన పడి ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతాశిశు కేంద్రం (ఎంసీహెచ్)లో బెడ్లు లేక తిప్పలు పడుతున్నారు. ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురిని ఉంచి చికిత్స చేస్తున్నారు. దీంతో ఇన్ఫెక్షన్లు పక్క చిన్నారులకు సోకే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎంసీహెచ్‌లో 70 బెడ్లు ఉన్నాయి. మరో 30 అదనంగా ఏర్పాటు చేశారు. వంద బెడ్లు ఉండగా.. ప్రస్తుతం 140కిపైగా అడ్మిషన్‌లో ఉన్నారు. ఇద్దరు, ముగ్గురు ఒకే మంచంపై ఉంచుతున్నారు. పట్టణ పరిధి నుంచే కాక చుట్టుపక్కల పల్లెలు, ఇతర మండలాలు, కర్ణాటక నుంచి కూడా ఆస్పత్రికి చిన్నారులను తీసుకొస్తున్నారు. దీంతో ఎంసీహెచ్ కిటకిటలాడుతోంది.

ఏఐఆర్‌కు దీటుగా ఎఫ్‌ఎం రేడియో

- జిల్లాలో రెండుచోట్ల ఆరు స్టేషన్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం
- ఎఫ్‌ఎం రేడియో ద్వారా విలువైన సమాచారం
- వీనుల విందైన పాటలు

హిందూపురం, ఆగస్టు 30

దేశవ్యాప్తంగా గతంలో ఆలిండియా రేడియో (ఏఐఆర్) నుంచి ఏఎం (యాంప్లిట్యూడ్ మాడ్యులేషన్) తరంగాలతో వార్తలు, పాటలు ఇతర సమాచారం ప్రసారమయ్యేవి. ఆధునిక సాంకేతికతతో ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్ తరంగాలతో ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు వచ్చేశాయి. వీటి ద్వారా ప్రసారమయ్యే అంశాలు కచ్చితత్వంతో ఉంటున్నాయి. శ్రోతలకు స్పష్టంగా వినిపిస్తుంది. దీంతో ఆలిండియా రేడియో కూడా ఏఎం నుంచి ఎఫ్‌ఎం దిశగా అడుగులు వేసింది. ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు 88 నుంచి 108 ఎంహెచ్‌జెడ్ బ్యాండ్‌లలో ప్రసారమవుతాయి. ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లలో కూడా రెండు రకాలున్నాయి. వైడ్ బ్యాండ్, న్యారోబ్యాండ్ స్టేషన్లుగా విభజించారు. ఈ రెండింటిలోనూ వాటికవే ఉపయోగాలున్నాయి. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాలకు మాత్రమే పరిమితమైన ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు ఇప్పుడు 68 ప్రధాన పట్టణాలకు విస్తరించనున్నాయి.

రెండు చోట్ల ఆరు స్టేషన్లు

జిల్లాలో హిందూపురం, ధర్మవరంలో ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రిత్వశాఖ ఆ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. ఎఫ్‌ఎం స్టేషన్లు ఏర్పాటు చేయబోయేవారికి ఆరు నెలల నిర్వహణా అనుభవం ఉండాలి. కనీసం రోజుకు 16 గంటల పాటు ప్రసారం చేయగలిగేలా ఉండాలి. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ జీఓ, పీఓ (వ్యాలీడ్ గ్రాంట్ పర్మిషన్) తీసుకోవాలి. వైర్‌లెస్ ఆపరేటింగ్ లైసెన్స్ ఉండాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసలుబాటు కల్పించారు. హిందూపురం, ధర్మవరంలో మూడు

ఎఫ్‌ఎం రేడియో ద్వారా విలువైన సమాచారం

చొప్పున స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎఫ్‌ఎం రేడియో ద్వారా స్థానికంగా జరిగే కార్యక్రమాలు, వ్యాపారాల ప్రచారం సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు శ్రోతలను ఉర్రూతలూగించే పాటలు, సంగీతం, ఇతర సమాచారాన్ని ప్రసారం చేయవచ్చు. హిందూపురం, ధర్మవరంలో ఏ బ్యాండ్‌కింద ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ నడుస్తుందో త్వరలో ప్రకటించనున్నారు. రేడియో స్టేషన్ల ఫ్రీక్వెన్సీని బట్టి ప్రసారాల దూరం అంచనా వేయవచ్చు. చిన్నచిన్న ఎఫ్‌ఎం స్టేషన్లు 4కి.మీ, నుంచి 6 కి.మీ, వరకు ప్రసార సామర్థ్యం కలిగి ఉంటాయి. పెద్ద ఎఫ్‌ఎం స్టేషన్లు 80 కి.మీ, వరకు ప్రసారాలు చేయగలిగే సామర్థ్యం కలిగి ఉంటాయి. ప్రస్తుతం ఏర్పాటుచేయబోయే ఎఫ్‌ఎం స్టేషన్ ఎంతదూరం వరకు ప్రసారం చేస్తుందనేది త్వరలో తేలనుంది. ఈ ఎఫ్‌ఎం రేడియో ప్రతి స్మార్ట్‌ఫోన్‌లోనూ డౌన్‌లోడ్ చేసుకుని, పాటలు వినవచ్చు. జిల్లాలో అత్యధిక జనాభా ఉన్న హిందూపురం, ధర్మవరంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. హిందూపురంలో రెండున్నర లక్షకుపైగా జనాభా ఉంది. ధర్మవరంలో కూడా అంతే మొత్తంలో ఉంది. ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు ఏర్పాటు కానుండడం పట్ల హిందూపురం, ధర్మవరం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అలా.. దొరికిపోయాడు..

ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బు వసూలు
తప్పించుకు తిరుగుతున్న పత్తికొండ వాసి
ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ప్రత్యక్షం
పట్టుకుని, పోలీసులకు అప్పగించిన బాధితుడు


ఉపేంద్ర

ధర్మవరం, ఆగస్టు 30: ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తి అనుకోని విధంగా బాధితుడికి పట్టుబడ్డాడు. స్థానిక రైల్వే స్టేషన్‌లో శుక్రవారం కనిపించిన మోసగాడిని బాధితుడు పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన నరేశ్ పట్టుకుని, పోలీసులకు అప్పగించాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరేశ్ బీటెక్ చదివి, ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణానికి చెందిన వడ్డే ఉపేంద్ర ఆన్‌లైన్‌లో పరిచయమయ్యాడు. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మి నరేశ్ రూ.1.50 లక్షదాకా ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. అప్పట్నుంచి ఉపేంద్ర తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో పనినిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లడానికి కుటుంబసభ్యులతో నరేశ్ శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ ఉపేంద్ర కనిపించడంతో చాకచక్యంగా పట్టుకుని, రైల్వేపోలీసుల వద్దకు తీసుకెళ్లాడు. వారి సలహా మేరకు టూటౌన్ పోలీసులకు అప్పగించాడు. ఉపేంద్ర 20 మంది నిరుద్యోగుల నుంచి రూ.50లక్షలదాకా వసూలు చేసినట్లు తెలుస్తోంది. అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎవరెవరి నుంచి ఎంత డబ్బు వసూలు చేశాడోనన్న వివరాలు రాబడుతున్నట్లు తెలుస్తోంది.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఖాద్రీ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం


వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

కదిరి, ఆగస్టు 30: శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీవ్రతం ఆచరించారు. ఆలయంలోని కల్యాణ వేదికపై అమ్మవారి ఉత్సవవిగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు.. వ్రతం ఆచరించారు. ఆలయ ప్రధానార్చకుడు పార్థసారధిచారులు శాస్త్రోక్తంగా వ్రతం చేయించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బోర్డు కబ్జా



ప్రభుత్వ బోర్డుపై ఇటుకల బట్టీ పేరు రాయించిన దృశ్యం

గత వైసీపీ పాలనలో కబ్జాల పర్వం సాగింది. ప్రభుత్వ భూములు, స్థలాలను అడ్డదారిలో కొట్టేశారు వైసీపీ నాయకులు. ఓ నాయకుడు మరో అడుగు ముందుకేశాడు. ప్రభుత్వ శాఖకు సంబంధించిన సూచిక బోర్డునే కబ్జా చేశాడు. దానిపై రాతలు కనిపించకుండా చేసి, తన ఇటుకల బట్టీ పేరు రాయించేశాడు. పెనుకొండ మండలం సుద్దబట్లపల్లి వాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గతంలో పెనుకొండ-మడకశిర రహదారి నుంచి సుద్దబట్లపల్లికి రూ.లక్షలు వెచ్చించి పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో తారురోడ్డు నిర్మించారు. ఇందుకు సంబంధించిన బోర్డును గ్రామ సమీపంలో పట్టిక రూపంలో ఏర్పాటు చేశారు. దానిని స్థానిక వైసీపీ నాయకుడు ఆదిరెడ్డి కబ్జా చేశాడు. తాను నిర్వహిస్తున్న సిమెంటు ఇటుకల బట్టీ బోర్డుగా మార్చుకున్నాడు. ఇటుకల బట్టీ కూడా అక్రమంగా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. బోర్డు కబ్జాపై పంచాయతీరాజ్ ఈఈ మురళిని అడగ్గా.. విషయం తన దృష్టికి రాలేదన్నారు. విచారించి, కేసు నమోదు చేస్తామని చెప్పుకొచ్చారు.

-పెనుకొండ రూరల్

కుటుంబ సభ్యుల్లా చెట్లను కాపాడుకుందాం

- పిల్లల పుట్టినరోజున మొక్క నాటుదాం
- పెనుకొండలో రూ.2 కోట్లతో పార్కుల అభివృద్ధి
- మంత్రి సవిత


పులేకమ్మ ఆలయ సమీపంలో మొక్కనాటి, నీరు పోస్తున్న మంత్రి సవిత, కలెక్టర్ చేతన్

పెనుకొండ/రూరల్, ఆగస్టు 30: మనిషికి ప్రాణాధారమైన చెట్లను కుటుంబ సభ్యుల్లా కాపాడుకుందామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం పట్టణ పరిసర ప్రాంతాలు బోగసముద్రం చెరువు, పులేకమ్మ ఆలయం వద్దగల అటవీవనంలో మంత్రి సవిత మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రమంతటా కోటి మొక్కలు నాటాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారన్నారు. ఆ మేరకు జిల్లాలో 25లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. పిల్లల పుట్టినరోజున తల్లిదండ్రులు మొక్క నాటాలని పిలుపునిచ్చారు. తన కుమారుడి ప్రతి పుట్టిన రోజు ఒక మొక్కను నాటిస్తున్నట్లు తెలిపారు. ఇలా 11 ఏళ్లగా మొక్కలు నాటించడమేకాక వాటిని పరిరక్షిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ తమ కుటుంబంలో జరిగే శుభకార్యం నాడు మొక్కను నాటి, సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం పెనుకొండలో రూ.2 కోట్లతో పార్కు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పార్కులో యోగా, ఫుట్‌కోర్టు, మైదానం తదితరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతన్, తహసీల్దార్ శ్రీధర్, సబ్ డీఎఫ్‌ఓ ఆనంద్, ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి కోసం స్థల పరిశీలన

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం వద్ద జాతీయ రహదారి పక్కన రెడ్‌క్రాస్ సొసైటీ నిర్మించ తలపెట్టిన ఆస్పత్రి కోసం మంత్రి సవిత స్థలాన్ని పరిశీలించారు. పాలసముద్రం రెవెన్యూ పొలంలోని సర్వే నంబరు 130-3లో స్థలాన్ని కేటాయించనుండడంతో మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ చేతన్, తహసీల్దార్ రెడ్డిశేఖర్, సీఐ శేఖర్ పాల్గొన్నారు.

ఏఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు



పుట్టపర్తి రూరల్, ఆగస్టు 30: జిల్లా ఏఎస్పీగా ఆర్ల శ్రీనివాసులును నియమిస్తూ డీజీపీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. పెనుకొండ డీఎస్పీగా పనిచేస్తున్న ఆర్ల శ్రీనివాసులు ఉద్యోగోన్నతిపై ఏఎస్పీ (అడ్మిన్)గా నియమితుడయ్యారు. ఇదివరకు ఏఎస్పీగా పనిచేస్తున్న విష్ణు ఏసీబీకి ఇటీవలే బదిలీపై వెళ్లారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా యువరాజ్

పుట్టపర్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించేందుకు జిల్లాకు ప్రత్యేకాధికారిగా యువరాజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2005 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఈయన ప్రస్తుతం పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయన జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, చేపట్టే అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించడంతోపాటు ఆయా విభాగాలను పరిపాలనపరంగా సమన్వయం చేసుకుంటారు. ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యాలను అధిగమించేలా చర్యలు తీసుకుంటారు.

ఆస్పత్రిలో చావు భయం!

ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనలతో ప్రభుత్వ ఆస్పత్రులు అంటేనే బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. ఆస్పత్రుల్లో సరైన సమయంలో వైద్యం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వైద్యం చేయాల్సిన డాక్టర్లు పట్టించుకోకపోవడంతో ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలు తమకు తెలిసిన వైద్యం చేసి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా రు. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రికి వస్తే బతుకుతామనే భరోసా పోయి రోగులు, వారి బంధువులను చావు భయం వెంటాడుతోంది.

- రాత్రిపూట వెళితే చావుకేక వినాల్సిందే!
- డాక్టర్లు ఉండరు... నర్సులు పట్టించుకోరు..
- ఎంఎన్‌ఓలు, సెక్యూరిటీగార్డులు, స్వీపర్లే వైద్యులు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరుగుతున్న మరణాలు

అనంతపురంటౌన్, ఆగస్టు 30:

● అనారోగ్యంతో బాధపడుతున్న బొమ్మయ్య(60)ను ఈనెల 21న రాత్రి రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. డాక్టర్లు ఎవరు పట్టించుకోలేదు. అయితే ఆస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీగార్డ్ ఆ వ్యక్తికి సెలైన్ ఎక్కించి వైద్యం అందించారు. తర్వాత బొమ్మయ్య ప్రాణాలు కోల్పోయారు. డాక్టర్లు పట్టించుకోలేదని, సెక్యూరిటీ గార్డ్ వైద్యం చేయడంవల్లే బొమ్మయ్య చనిపోయాడంటూ కుటుంబసభ్యులు ఆరోపించారు.

● కణేకల్లు మండలం యర్రగుంట గ్రామానికి చెందిన బాలిక ముజ్బా కౌసర్(9) డెంగీ జ్వరంతో బాధపడుతుండగా కణేకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి ఈనెల 25న కుటుంబసభ్యులు తీసుకొచ్చారు. డాక్టర్లు అడ్మిట్ చేసుకున్నారు. అయితే వైద్యం చేయడం మరిచిపోయారు. పాప మృతి చెందింది. ఆస్పత్రిలో పనిచేసే స్వీపర్ వైద్యం అందించారని, అందుకే బాలిక మృతి చెందిందని కుటుంబసభ్యులు, సీపీఐ శ్రేణులతో కలిసి డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేపట్టారు.

● హిందూపురం పెద్దాసుపత్రిలో ఈనెల 21న ప్రసవానికి వచ్చిన ఇద్దరు గర్భిణుల విషయంలో డాక్టర్లు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. దీంతో ఇద్దరు శిశువులు చనిపోయారు. పరిగి మండలం చిన్నపల్లి గ్రామానికి చెందిన గర్భిణి ప్రీతికి నొప్పులు రావడంతో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకొచ్చారు. వెంటనే అడ్మిషన్ చేసుకోకుండా డాక్టర్ నీరజ నిర్లక్ష్యం చేశారు. చివరకు మరుసటి రోజు తెల్లవారుజామున నొప్పులు మరింత ఎక్కువ కావడంతో వార్డులో ఉన్న నర్సు ఫోన్‌లో డాక్టర్‌కు విషయం తెలపగా అనంతపురం ఆస్పత్రికి వెళ్లమని చెప్పండని సమాధానమిచ్చారు. ఇక్కడేకాన్పు అయ్యేటట్లు ఉందని డాక్టర్‌కు చెప్పినా పట్టించుకోలేదు. చివరకు అక్కడ నర్సే కాన్పుచేయగా శిశువు మరణించింది.

● అదేరోజే లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన గర్భిణి ఆశాను ప్రసవం కోసం హిందూపురం ఆస్పత్రికి తీసుకురాగా ఆమె విషయంలోను డాక్టర్ తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ఇక్కడ కూడా చివరకు ఆమెకాన్పు జరిగినా శిశువు మరణించింది.

● అనంత జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఈనెల 27న రాత్రి ఎంఎంవార్డులో చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు మరణించారు. తాడిపత్రికి చెందిన ఈశ్వరయ్య(38) తీవ్రంగా ఇబ్బంది పడుతున్నా ఉదయంనుంచి ఎవరు పట్టించుకోలేదు. చివరకు మంచంపైనే రక్తం కక్కి ప్రాణాలు వదిలారు. అదేవార్డులో చికిత్స పొందుతున్న శ్రీసత్యసాయి జిల్లా ఎన్‌పీకుంటకు చెందిన నాగయ్య(40) అనే రోగి కూడా సరైన చికిత్స అందక మృతి చెందాడు. ఇవి ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు మాత్రమే. గతంలో ఇలాంటి మరణాలు లెక్కకు మించి ఉన్నాయి. కానీ ప్రభుత్వ ఆస్పత్రుల తీరు మాత్రం మారకపోవడం అందరినీ కలచివేస్తోంది.

ఎంఎన్‌ఓలు, సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లతోనే వైద్యం

గతంలో కన్నా ఇపుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు, అవసరమైన డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది ఉన్నారు. సీహెచ్‌సీలలో అయితే ఒక్కో ఆస్పత్రిలో 12 మంది వరకు డాక్టర్లు, టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు ఉంటున్నారు. వీరుకాక శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది ఉంటున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో ఒక్కో ఆస్పత్రిలో ఇద్దరు నుంచి ముగ్గురు డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది కలిపి దాదాపు 11మంది ఉంటున్నారు. ప్రతి డాక్టర్, ఇతర సిబ్బంది ఉదయం 9గంటలనుంచి సాయంత్రం 4గంటలవరకు ఆస్పత్రులలోనే ఉండాలి. ఆతర్వాత రాత్రి డ్యూటీలో ఒక డాక్టర్, ఒక నర్సు, ఎంఎన్‌ఓ, సెక్యూరిటీ మరుసటిరోజు ఉదయం 9గంటలవరకు ఉండాల్సి ఉంటుంది. కానీ ఈఆస్పత్రులలో డాక్టర్లు అసలు ఉండటం లేదు. సాయంత్రం వరకు ఉండి కొందరు తామె కాపురాలు ఉంటున్న జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నారు. మరికొందరు తమ సొంత క్లినిక్‌లకు వెళుతున్నారు. నర్సులు ఉంటున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆస్పత్రులకు రాత్రిపూట ఎమర్జెన్సీ కేసులను తీసుకెళితే డాక్టర్లకు వీడియోకాల్ చేసి చూపించి తెలిసీ తెలియని వైద్యాన్ని నర్సులు, అక్కడున్న ఎంఎన్‌ఓలు, సెక్యూరిటీగార్డులు, స్వీపర్లే చేసేస్తున్నారు. అందుకే ఆయా ఆస్పత్రులలో రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు.

భయపెడుతున్న ప్రభుత్వ ఆస్పత్రులు


జిల్లాప్రభుత్వ ఆస్పత్రిలో పేషెంట్‌కు సెలైన్ ఎక్కిస్తున్న ఎఫ్ఎన్‌ఓ

ఆస్పత్రి అంటే చనిపోతున్న వ్యక్తికి కూడా బతుకుతామనే ధైర్యాన్ని ఇవ్వాలి. కానీ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. అత్యవసర సమయాలలోను, రాత్రిపూట ప్రభుత్వ ఆస్పత్రులకు రావాలంటే రోగులు, వారి కుటుంబసభ్యులు భయపడిపోతున్నారు. ఇక్కడకు వస్తే ఎవరూ పట్టించుకోరని, డాక్టర్లు ఉండరని, ఎంఎన్‌ఓలు, స్వీపర్లు వైద్యం అందించి చంపేస్తారనే మాటలు జనం నుంచి వినిపిస్తున్నాయి. జరుగుతున్న ఘటనలు కూడా ఇందుకు బలం చేకూర్చు తున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం జిల్లా వైద్య శాఖ పరిధిలో అనంత


జిల్లా ఆస్పత్రిలో మూడురోజుల కిందట ఎంఎం వార్డులో చికిత్సపొందుతూ చనిపోయిన ఎన్‌పీకుంట నాగయ్యకు ఈసీజీ తీస్తున్న ఎంఎన్‌ఓ

జిల్లాలో 47 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు అర్బన్ ప్రాంతాలలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. వైద్యవిధాన పరిషత్‌శాఖ పరిధిలో తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గంలలో ఏరియా ఆస్పత్రులు ఉండగా, అనంతపురం పాతూరులో ఒక సీడీ ఆస్పత్రితో పాటు ఉరవకొండ, శింగనమల, పామిడి, కళ్యాణదుర్గం, కణేకల్లు, కొనకొండ్లలో సీహెచ్‌సీలు ఉన్నా యి. జిల్లాకేంద్రంలో జిల్లా సర్వజన ప్రభుత్వ పెద్దాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఉన్నాయి. ఇన్ని ఆస్పత్రులు ఉన్నాయని గొప్పగా చెప్పుకుంటున్నా ఇక్కడ డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది అనుకున్న మేరకు ప్రజలకు వైద్యసేవలు అందించడంలేదు. ఈ ఆస్పత్రులకు రోగులు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.

● జిల్లా సర్వజన ఆస్పత్రిలో దయనీయం

అనంత జిల్లా ప్రజలకు గుండెలాంటి సర్వజన ఆస్పత్రిలోను దయనీయ పరిస్థితులు ఉన్నాయి. ఇక్కడకు రోజుకు 2వేల మంది వరకు వివిధ రకాల జబ్బులతో వస్తుంటారు. కనీసం 1200మంది వరకు అడ్మిషన్‌లో ఉంటూ చికిత్స పొందుతుంటారు. ఈస్థాయికి తగ్గట్టుగా వసతులు, డాక్టర్లు,నర్సులు, ఇతర విభాగాల సిబ్బంది లేకపోయినా గతంకన్నా మెరుగైన వసతులు, డాక్టర్లు, నర్సులు ఇతర సిబ్బంది ఉన్నారు. కానీ ఇప్పటికీ రోగులకు సకాలంలో సరైన వైద్యసేవలు అందించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నా యి. ఇకరాత్రి సమయాలలో డ్యూటీ డాక్టర్లు సక్రమంగా ఉండటం లేదని, నర్సులు ఉన్నా పేషెంట్లను పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అక్కడ ఉండే జూనియర్ డాక్టర్లు ఫోన్ ద్వారా సీనియర్ డ్యూటీ డాక్టర్లను కనుక్కొని వైద్యం అందిస్తున్నారు. అందుకే రాత్రి సమయాల్లో అత్యవసర పేషెంట్లకు ఆస్పత్రిలో ఉంటున్న ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలు, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులే వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో సకాలంలో సరైన వైద్యం అందక అనేకమంది రోగులు జిల్లా ఆస్పత్రిలో చనిపోతున్నారు.

● నిద్రమత్తులో పర్యవేక్షణ యంత్రాంగం

జిల్లాలో ఆస్పత్రులను పర్యవేక్షించే అధికార యంత్రాంగం నిద్రమత్తులో తూగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. పీహెచ్‌సీలను డీఎంహెచ్‌ఓ, సీహెచ్‌సీలను డీసీహెచ్ఎస్, ఆస్పత్రిని సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. డాక్టర్లు డ్యూటీలకు వెళుతున్నారా? వెళ్లినవారు రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారా? సమయపాలన పాటిస్తున్నారా? రాత్రి డ్యూటీలో ఉంటున్నవారు నిబంధనల మేరకు విధులు నిర్వర్తిస్తున్నారా? రాత్రిపూట వస్తున్న రోగులకు తగిన వైద్య చికిత్సలు అందిస్తున్నారా ? లేదా అని మానటరింగ్ చేయాలి. కానీ ఇక్కడ పర్యవేక్షణ అధికారులు జిల్లాకేంద్రంలోనే ఎక్కువ గడుపుతున్నారు. ఎక్కడైనా ఏదైనా ఘటన జరిగినపుడు అక్కడకు వెళ్లి తూతూమంత్రంగా పరిశీలించి వెనుదిరిగి వస్తున్నారు. ఇక జిల్లా ఆస్పత్రిలో పరిస్థితి అయితే మరీ దయనీయంగా ఉంది. ఏ డాక్టర్, ఏ నర్సు, ఏవిభాగం సిబ్బంది ఎపుడు వస్తున్నారో ఎపుడు పోతున్నారో కూడా పర్యవేక్షణ అధికారులకు తెలియడంలేదు. కేవలం హాజరు చూస్తున్నారు, జీతాలు చేస్తున్నారే తప్ప విధులకు డుమ్మా కొట్టి తిరుగుతున్నవారిని మాత్రం పట్టుకోలేకపోతున్నారు.

రాయదుర్గం ఘటనలో చర్యలు తప్పవు



రాయదుర్గం ఆస్పత్రిలో ఇటీవల జరిగిన ఘటనను సీరియస్‌గా తీసుకున్నాం. దీనిపై నేనే స్వయంగా వెళ్లి విచారణ జరిపా. వాస్తవాలు తెలుసుకున్నా. ఈవ్యవహారంపై ముగ్గురిపై చర్యలు తప్పవు. డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది పనితీరుపైనా నిఘా ఉంచుతున్నాం. రాత్రి డ్యూటీల సమయంలో వీడియోకాల్‌చేసి అక్కడున్నారా లేదా అనికూడా ఆరా తీస్తున్నాం. విధులకు డుమ్మా కొట్టేవారిని, విధులలో నిర్లక్ష్యం చేసి రోగుల జీవితాలతో ఆడుకునేవారిని ఉపేక్షించం.

-డాక్టర్ రవికుమార్, డీసీ హెచ్ఎస్

ఎంఎన్‌ఓలు వైద్యం చేయకూడదు



ఆస్పత్రిలో పని చేస్తున్న ఎంఎన్‌ఓలకు కొన్నింటిపై శిక్షణ ఇచ్చి ఉంటాం. సీరియస్ పేషెంట్లు ఆస్పత్రికి వచ్చినపుడు అత్యవసర సమయాలలో మాత్రమే వారికి కొన్ని సేవలు అందించవచ్చు. అలా అని డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు ఉన్నపుడు ఎంఎన్‌ఓలు ఎట్టి పరిస్థితులలోను రోగులకు వైద్యసేవలు అందించకూడదు. రాత్రి సమయాలలో ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయి. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. డ్యూటీలో ఉండి వారిని వినియోగించుకున్నవారిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్

కణేకల్లు ఘటనపై విచారణ చేస్తున్నాం



కణేకల్లు ఆస్పత్రిలో జ్వరంతో వెళ్లిన ఓ బాలికకు స్వీపర్ వైద్యం అందించారని, ఆతర్వాత బళ్లారికి తీసుకెళ్లగా అక్కడ పరిస్థితి విషమించి చనిపోయిందన్న ఆరోపణలు వచ్చాయి. డాక్టర్ తప్పనిసరిగా రాత్రి సమయాలలోకూడా ఉండి రోగులకు వైద్యసేవలు అందించాలి. ఇక్కడ ఆ అమ్మాయికి చికిత్స ఇచ్చామని చెబుతున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నాం. వాస్తవాలు తేలిన తర్వాత ఆస్పత్రిలో తప్పు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటాం. పీహెచ్‌సీలలో రాత్రిడ్యూటీ డాక్టర్లు తప్పనిసరిగా ఉండాలి. అలాఉండని వారిపై కూడా చర్యలు ఉంటాయి.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్‌ఓ

కరువు నేలపై జ్ఞాన కాంతులు

- ● జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ సుదర్శన రావు
- ● ఘనంగా వర్సిటీ ఆవిర్భావ వేడుకలు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 30: కరువు నేలలో జ్ఞానకాంతులు నింపిన విద్యాలయంగా జేఎన్‌టీయూ ఖ్యాతి గడించిందని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వేడుకలకు వీసీతో పాటు రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ సాంకేతిక విద్యావిప్లవాన్ని తీసుకువచ్చి జిల్లాకు ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటిన ఘనత జేఎన్‌టీయూకు దక్కుతుందన్నారు. ఆరు బ్రాంచ్(కోర్సు)లతో ఏటా వందలాది మంది ఇంజనీర్లను సమాజానికి అందిస్తోందన్నారు. నేడు నాలుగు కాన్‌స్టిట్యూయెంట్ కళాశాలలు, 120కి పైగా అనుబంధ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలతో జాతీయస్థాయిలో ప్రథమ వర్సిటీగా జేఎన్‌టీయూ గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులతోపాటు అనేక ప్రాజెక్టులు, జర్నల్స్, పేటెంట్స్‌ను సొంతం చేసుకుని తిరుగులేని వర్సిటీగా రాణిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక రంగాల్లో జేఎన్‌టీయూ విద్యార్థులు ఉన్నతశిఖరాలను అధిరోహించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులందజేసి ప్రశంసించారు. కార్యక్రమంలో ఈవెంట్స్ కోఆర్డినేటర్లు నారాయణరెడ్డి, దుర్గాప్రసాద్, ఓఎస్‌డీటు వీసీ ప్రొఫెసర్ దేవన్న, డైరెక్టర్ సత్యనారాయణ, నాగప్రసాద్ నాయుడు, సురేష్‌బాబు, వైశాలి గోర్పాడే, కిరణ్మయి, సుజాత, పీర్వో డాక్టర్ ఓంప్రకాష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీసీ సుదర్శన రావు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు, స్టెప్పులతో విద్యార్థులు ఉర్రూతలూగించారు. సమాజానికి ఇంజనీరింగ్, సాంకేతిక విద్య అవసరాలు, జేఎన్‌టీయూ మైలు రాళ్లను వివరించేలా పాటలతో ఆలోచింపజేశారు. అదేవిధంగా భరత నాట్యం, శ్రీకృష్ణ గోపికలు, జానపద నృత్యాలతో చూపరులను ఆకట్టుకున్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

బదిలీల గడువు పొడిగింపు

అనంతపురం టౌన్, ఆగస్టు 30: ప్రభుత్వశాఖలలో అధికారులు, ఉద్యోగుల బదిలీల గడువును వచ్చే నెల 15కి పొడిగించారు. గతంలో ఈనెల 31వరకే బదిలీలకు ఆఖరి గడువుగా ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 16శాఖలలో బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఆయాశాఖలలో ఈ బదిలీలకు సంబంధించి సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో పాటు విధివిధానాల రూపకల్పనలో ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో గడువు పొడిగించారు.

పలువురు సీఐల బదిలీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 30: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ రత్న శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో వీఆర్‌లో ఉన్న యుగంధర్‌ను అనంతపురం జిల్లా పామిడి యూపీఎస్‌కు, అనంతపురం జిల్లా వీఆర్‌లో ఉన్న నరేంద్రరెడ్డిని నల్లమాడ సర్కిల్‌కు, బుక్కరాయసముద్రం యూపీఎస్‌లో పనిచేస్తున్న శ్రీధర్‌ను రామగిరికి, ఆ సర్కిల్‌లో ఉన్న సీతాంజనేయులును శ్రీసత్యసాయి జిల్లా వీఆర్‌కు బదిలీచేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు.

స్పెషల్ ఆఫీసర్‌గా కాంతిలాల్‌దండే

అనంతపురం టౌన్, ఆగస్టు 30: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి తదితర కార్యక్రమాల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి జిల్లాకు ఓ ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించాలని ఆదేశించారు. ఆమేరకు శుక్రవారం స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులోభాగంగా అనంత జిల్లాలో పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండేను నియమించారు. ఇకనుంచి ఈయన జిల్లాలో ప్రభుత్వపథకాలు, అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తారు.

ప్రజాసేవే పరిటాల రవీంద్ర ఆశయం

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌చార్జి శ్రీరామ్

ఘనంగా జయంతి వేడుకలు


పరిటాల రవి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్, కుటుంబసభ్యులు

రామగిరి, ఆగస్టు 30: ప్రజలకు సేవచేయడమే దివంగత పరిటాల రవీంద్ర ఆశయమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి వేడుకలు శుక్రవారం వెంకటాపురంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పరిటాల రవీంద్ర ఘాట్‌ను ఆయన అభిమానులు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాలశ్రీరామ్ తమ కుటుంబసభ్యులతో కలిసి పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి వచ్చి పరిటాల అభిమానులతో వెంకటాపురం గ్రామం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిటాల రవీంద్ర చనిపోయి ఇన్నేళ్లు అవుతున్న ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు పెద్దఎత్తున అభిమానులు తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారంటే ఆయన చేసిన ప్రజాసేవే కారణమన్నారు. ఆయన ఆశయాలను పరిటాల శ్రీరామ్ కూడా కొనసాగిస్తారని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు.


ఎంజేపీ పాఠశాలలో విద్యార్థినులకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తున్న పరిటాల సునీత

బ్యాట్ vs బాల్

- ● క్రికెట్ అభిమానులకు పండుగ
- ● జిల్లాలో దులీప్‌ట్రోఫీ నిర్వహణ
- ● అనంతలో తొలిసారి భారీ టోర్నీ
- ● ఐదు నుంచి పోటీలు.. ఏర్పాట్లు పూర్తి


అనంతపురం క్రికెట్ గ్రౌండ్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 30: దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలకు అనంతపురం తొలిసారి వేదిక కానుంది. బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్రికెట్ పోటీలు సెప్టెంబరు 5 నుంచి అనంతపురం క్రికెట్ గ్రౌండ్ (ఏసీజీ) వేదికగా జరనున్నాయి. దేశంలోని దిగ్గజ క్రికెట్ క్రీడాకారులు జిల్లాకు రానున్నారు. సెప్టెంబరు 5 నుంచి 22 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆర్డీటీ స్టేడియంలో ఇండియా-ఏ, ఇండియా-బీ, ఇండియా-సి, ఇండియా-డీ జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి.

ఇండియా-ఎ: శుభమన్‌గిల్ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్‌జురెల్, కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, శివం దూబె, తనుష్‌కొటినా, కులదీప్ యాదవ్, ఆకాష్‌దీప్, ప్రసిద్ధ్‌కృష్ణ, ఖలీల్‌అహ్మద్, అవేష్‌ఖాన్, విద్వత్ కావేరప్ప, కుమార్ కుషగ్రా, శావత్ రావత్.

ఇండియా-బి: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, సర్ఫ్‌రాజ్ ఖాన్, రిషబ్‌పంత్, ముషీర్‌ఖాన్, నితీష్‌కుమార్‌రెడ్డి, వాషింగ్టన్ సుందర్, నవ్‌దీప్ సైనీ, రవీంద్ర జడేజా, యష్‌దయాల్, ముకేష్‌కుమార్, రాహుల్‌చాహర్, సాయికిశోర్, మోహిత్‌అవాస్తి, జగదీషన్.

ఇండియా-సి జట్టు: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయిసుదర్శన్, రజత్ పటీదార్, అభిషేక్ పోరల్, సూర్యకుమార్ యాదవ్, బి ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, గౌరవ్‌యాదవ్, వైషాక్ విజయ్ కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్ష్‌చౌహాన్, మయాంక్ మార్కండే, సందీప్ వారియర్.

ఇండియా-డి: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అథర్వ తైడే, యష్‌దుబే, దేవ్‌దత్ పడిక్కల్, ఇషాన్‌కిషాన్, రిక్కీభాయ్, సరాన్ష్‌జైన్, అక్షర్‌పటేల్, అర్ష్‌దీప్‌సింగ్, ఆదిత్యథాక్రే, హర్షిత్‌రాణా, తుషార్ దేశ్‌పాండే, ఆకాష్‌సేన్ గుప్తా, కేఎస్ భరత్, సౌరభ్‌కుమార్.

బీసీసీఐ క్యూరేటర్‌తో పిచ్ ఏర్పాటు



దులీప్‌ట్రోఫీకి సంబంధించి పోటీలకు ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నారు. పిచ్ తయారు చేయడానికి బీసీసీఐ క్యూరేటర్ సమందర్‌సింగ్ వచ్చారు. మధ్యప్రదేశ్ ఇండోర్‌కు చెందిన సమందర్‌సింగ్ దులీప్ ట్రోఫీ క్యురేటర్‌గా నియమితులయ్యారు. టర్ఫ్ వికెట్ కింద పిచ్ ఏర్పాటు చేస్తున్నారు. సమందర్‌సింగ్ గత 40 ఏళ్లుగా క్యురేటర్‌గా పని చేస్తున్నారు. 1997లో వరల్డ్‌కప్‌లో క్యురేటర్‌గా పనిచేశారు. గ్వాలియర్ మ్యాచ్‌లో 2010లో సచిన్‌టెండూల్కర్ డబుల్ సెంచరీ చేసిన పిచ్‌ను కూడా సమందర్‌సింగే తయారు చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో సదుపాయాలు

దులీప్‌ట్రోఫీకి సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాలతో సదుపాయాలు కల్పిస్తున్నారు. ఖరీదైన వసతులు కల్పించేందుకు మొత్తం బీసీసీఐ భరిస్తుంది. నగరంలోని మాసినేని గ్రాండ్, అలెగ్జాండర్ హోటల్‌లో రూమ్‌లు బుక్ చేశారు. ఒక్కో జట్టుకు 23 గదులను కేటాయించారు. ఇలా నాలుగు జట్లుకు 92 గదులను అందుబాటులో ఉంచారు. బీసీసీఐ సెలెక్టర్లు, కామెంటేటర్లు, అంపైర్లు, యాంటీ కరప్షన్ టీం సభ్యులు ఉన్నారు. సెలెక్టర్లు అజిత్ అగార్కర్, సుబ్రతో బెనర్జీ వస్తున్నారు.

నేడు పాసుల జారీ

సెప్టెంబరు 5 నుంచి అనంతపురం క్రికెట్ గ్రౌండ్ (ఏసీజీ)లో నిర్వహించే బీసీసీఐ దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలకు సంబంధించిన పాసులు శనివారం ఉదయం అనంత క్రీడాగ్రామంలో జారీ చేయనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ షాబుద్దీన్ తెలిపారు. ఒక్కో వ్యక్తికి ఒక పాసు మాత్రమే ఇస్తారన్నారు. ఏ రోజు మ్యాచ్‌కు ఆరోజే పాసులు అందజేస్తారన్నారు. మ్యాచ్ రోజు ఉదయం 8.20 నుంచి లోపలికి అనుమతిస్తారని, ఉదయం 10.30గంటలకు గేటు మూసివేస్తామన్నారు. వాహనాల పార్కింగ్ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ సమీపంలో, వీఐపీ వాహనాలు అనంత క్రీడాగ్రామంలో అనుమతిస్తామన్నారు. స్టేడియం సమీపంలో స్నాక్స్ కౌంటర్లు, తాత్కాలిక క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. చుట్టుపక్కల తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు.

ఆటగాళ్లకు భోజన వసతి ఇలా..

దులీప్ ట్రోఫీలో పాల్గొనే ఆటగాళ్ల అభిరుచుల ఆధారంగా భోజనం ఏర్పాటు చేయనున్నారు.

బ్రేక్ ఫాస్ట్‌లో...

ఓట్స్, మిల్క్, హనీ, ఫ్రెష్ ఫ్రూట్స్, డ్రై ఫ్రూట్స్ ఏర్పాటు చేయనున్నారు. ఆమ్లెట్, మష్రూమ్స్ బ్రోసిల్, టమోటా సూప్, బాయిల్డ్ ఎగ్, బేక్డ్ బీన్స్ రోస్టెడ్ పోటాటోస్, వెజిటబుల్స్ మల్టీ గ్రెయిన్ బ్రెడ్, పీనట్ బటర్, జామ్, హనీ ఇస్తారు. పోహా, ఉప్మా, ఇడ్లీ, కిచిడీ, దోసె, మిల్లెట్ రోటీస్, లైవ్ జోసీ, ఇండియన్ స్నాక్స్ ఏర్పాటు చేస్తారు. ఇక సాంబారు, చట్నీ, సబ్జి కర్రీలు ఏర్పాటు చేస్తారు. టీ, కాఫీ, సోయా మిల్క్, హాట్ కోల్డ్ స్కిమ్డ్ మిల్క్ అందుబాటులో ఉంచుతారు.

మధ్యాహ్నం లంచ్‌లో....

స్పించ్ సూప్, అస్పారగస్ సూప్, మిక్స్‌డ్ వెజిటేబుల్ సూప్, మష్రూమ్ క్రీమ్ సూప్, చికెన్ సూప్, టమోటా సూప్ ఉంటుంది. వెజ్, నాన్ వెజ్ సలాడ్‌లో ఏర్పాటు చేస్తారు. ఐస్‌బర్గ్ లెట్యూస్, దానిమ్మ సూప్, బీట్రూట్ సూప్, రెడ్ గ్రేప్స్ సూప్, గోడంబి సూప్‌కు ఆలివ్ ఆయిల్, హనీ ఆప్షన్లు ఉంచుతారు. గ్రీక్ సలాడ్, రష్యన్ సలాడ్, ఆపిల్ క్యాలరీ సలాడ్, టమోటా బేసిల్ సలాడ్, కేసర్ సలాడ్ ఉంటుంది. చిక్ పెన్స్, డైస్డ్ టమోటా, డైస్ ఆనియన్, డైస్డ్ కుకుంబర్, లెమన్ ఉంటాయి. గ్రిల్డ్ చికెన్, గ్రిల్డ్ ఫిష్, తందూరి ఫిష్, రోస్టెడ్ ఫిష్ ఏర్పాటు చేస్తారు. సైనిచ్ కాటేజ్ పన్నీర్ చీజ్, గ్రిల్డ్, తందూరి, రోస్టెడ్ పన్నీర్ ఏర్పాటు చేయనున్నారు. వెజ్ గ్రేవీలో చికెపీ లైట్, సోయా చంక్, బీన్స్ గ్రేవీ, లెంటిల్, తడ్కా, ఎల్లో, బ్లాక్ ఉంటుంది. మిక్స్‌డ్ వెజిటబుల్స్ రోస్టెడ్ వెజిటబుల్స్ ఉంటాయి. బ్రౌన్ రైస్, రెడ్ రైస్, స్టీమ్డ్ రైస్ ఉంటుంది. రోటీ, మిల్లెట్ రోటీ, పుల్కా ఉంటాయి.

ఈవెనింగ్ స్నాక్స్

మల్టీ గ్రెయిన్ బ్రెడ్ చికెన్ సాండ్‌విచ్, మల్టీ గ్రెయిన్ బ్రెడ్ వెజ్ సాండ్‌విచ్, గ్రిల్డ్ చికెన్ టిక్కా, గ్రిల్డ్ పన్నీర్ టిక్కా, టమోటా కెచప్, మింట్ చెట్నీ ఏర్పాటు చేస్తారు. చికెన్, వెజ్ మల్టీ గ్రెయిన్ పాస్తా, మిల్లెట్ రోటీ, పుల్కా, గ్రీన్ లీఫీ గ్రేవీ, పన్నీర్ రజ్మా, డ్రై లేడీస్ ఫింగర్స్, క్యాబేజీ, బీన్స్, గ్రిల్డ్ బ్రోసిల్ మష్రూమ్స్ ఇస్తారు. బనానా, స్ట్రాబెర్రీ జ్యూస్, హనీ బనానా షేక్, టీ, కాఫీ ఇస్తారు.

అన్ని రకాల ఫుడ్స్ ఆలివ్ ఆయిల్‌తోనే చేస్తారు. లెస్ స్పైసీ, లెస్ మసాలా, పాన్ ఫ్రైడ్, నో డీప్ ఫ్రైడ్ పెడ్, నో రీఫైండ్ ఫ్లోర్ ఇవ్వకూడదు. అన్ని రకాల ఫుడ్స్ 65 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉండాలి. ఇక డ్రెస్సింగ్ రూమ్‌లో ఫ్రెష్ ఫ్రూట్స్, డ్రై ఫ్రూట్స్, ఫ్రెష్ జ్యూస్, కోకోనట్ వాటర్ ఉంటాయి. ఇక నైట్ డిన్నర్ ప్లేయర్ల ఆప్షన్లను పరిగణలోకి తీసుకుని తయారు చేస్తారు. ఇతరులు ఇచ్చే ఎటువంటి ఫుడ్స్‌ను ప్లేయర్లకు ఇవ్వరు.

రాయలసీమ రుచులకు ప్రాధాన్యం

రాయలసీమలో లభించే రుచులను ప్లేయర్లకు ఇవ్వనున్నారు. ముఖ్యంగా నాటుకోడి, రాగి ముద్ద, చెట్నీ-రాగిముద్ద వంటి వాటితోపాటు ప్లేయర్లు ఇచ్చే ఆప్షన్ల ప్రకారం అందివ్వనున్నారు.

సత్యసాయి సేవలు అద్వితీయం

మహాసమాధిని దర్శించుకున్న ధర్మస్థల ధర్మాధికారి


వీరేంద్రహెగ్డేకు జ్ఞాపికను అందజేస్తున్న ఆర్జే రత్నాకర్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 30: సత్యసాయిబాబా మానవాళికి అందించే సేవలు అద్వితీయమని ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్రహెగ్డే కొనియాడారు. శుక్రవారం ఆయన ప్రశాంతి నిలయం సాయి కుల్వంత్ సభామండపంలో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. కుల, మత, ప్రాంత బేధాలు లేకుండా మానవాళికి ఆధునాతన వైద్యసేవలు అందిస్తున్నారని ఆయన కొనియాడారు. మానవతావిలువలతో కూడిన విద్యను అందించి సత్యసాయి మహోన్నతమూర్తిగా నిలిచారన్నారు. అవతార మూర్తి శివైక్యం అనంతరం కూడా బాబా స్ఫూర్తితో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సేవా కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా అందిస్తుండటం అద్భుతమన్నారు. ఆధ్యాత్మిక కేంద్రానికి చేరుకునే దశలో తాను 20 కిలోమీటర్ల దూరం నుంచే తాను సత్యసాయి దివ్య ప్రకంపనల అనుభూతిని పొందానన్నారు. అంతకు మునుపు ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్రహెగ్డేకు శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, మనోహర్‌శెట్టి ఘనస్వాగతం పలికారు. సత్యసాయి జ్ఞాపికను అందచేసి సన్మానించారు.

11 నుంచి ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా ఇసుక

పుట్టపర్తి, ఆగస్టు 30: ఆన్‌లైన్ ద్వారా ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని సెప్టెంబరు 11 నుంచి అమలులోకి తెస్తున్నామని, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్‌కుమార్‌మీనా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయన జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్, గనులశాఖ అధికారి రాంమోహన్ పాల్గొన్నారు. ఇసుకకు సంబంధించిన 18005 994599 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందిస్తున్నామని, గడువుల తేదీలు, మ్యాన్ పవర్, ఏజెన్సీల నియామకం, స్టాకు యార్డు ఇన్‌చార్జిలు, ఇతర స్టాఫ్ నియామకం, టెండర్ ప్రక్రియ ద్వారా తవ్వకం, లోడింగ్, అంతర్గత రవాణా సంస్థలు తదితర అంశాలను సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కరుణాసాగర్‌రెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'జేఆర్ సిల్క్'పై చర్యలు తీసుకోవాలి

మంత్రి సవితకు సీపీఐ నాయకుల వినతి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ధర్మవరం, ఆగస్టు 30: ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి సమీపంలో 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి నిర్వహిస్తున్న జేఆర్ సిల్క్ ప్రైవేటు లిమిటెడ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మసుగు మధు విన్నవించారు. ఈ మేరకు గురువారం వారు అమరావతిలో చేనేత మంత్రి సవితను, హ్యాండ్‌లూమ్ కమిషనర్ రేఖరాణికి వినతిపత్రాలు అందజేశారు. వారు జింకా రామాంజినేయులుకు చేనేత ప్రాజెక్టులో జరుగుతు న్న అక్రమాలు వివరించారు. రిజర్వేషన్ చట్టాన్ని కాపాడాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి చేనేత కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. దీంతో చేనేత కార్మికులు కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్య లకు పాల్పడుతున్నారన్నారు. జౌళిశాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇప్పటి వరకు పట్టణంలో చేనేత బకాసురులను వదిలిపెట్టి... ఒకటి లేదా రెండు పవర్‌లూమ్స్ మగ్గాలు నిర్వహిస్తున్న యజమానులపై కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. వారు బడానేతలపై ఎలాంటి కేసులూ నమోదు చేయకుండా.. అండగా ఉంటున్నారన్నారు. పవర్‌లూమ్స్‌లో పట్టుచీరలు నేస్తున్న విషయాన్ని బయటకు వస్తుందనే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులకు అక్కడ పని కల్పించారన్నారు. కావున జేఆర్ సిల్క్ ప్రైవేటు లిమిటెడ్‌పై చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు.

శ్రీకృష్ణుని ప్రతిమ ఊరేగింపు

ముదిగుబ్బ, ఆగస్టు 30: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురష్కరించుకొని ప్రబోధానందా సేవా సమితి, త్రైత సిద్ధాంత సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక బస్‌షెల్టర్ వద్ద శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి శుక్రవారం పూజలు నిర్వహి ంచారు. అనంతరం ప్రతిమను ఊరేగించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రబోధానంద సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



ధర్మవరం: ధర్మవరం వన్‌టౌన్ సీఐగా నాగేంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సుబ్రమణ్యం నందికొట్కూరుకు బదిలీ అయ్యారు. తాడిపత్రిలో పనిచేస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

మండల సర్వసభ్య సమావేశం

కదిరి అర్బన్, ఆగస్టు 30: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఎంపీపీ తోట అమరనాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని అన్నారు. ఆయాశాఖలాధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఉత్తమ అధికారులుగా ఎంపికైన ఎంపీడీఓ అంజనప్ప, ఏఓ నారాయణను సన్మానించారు. సమావేశంలో జడ్పీటీసీ రాధాభాయి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి

ధర్మవరం, ఆగస్టు 30: ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం డీఎస్పీ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. చెన్నేకొత్తపల్లి మండలం వెంకటంపల్లిలో దళిత రాజు, అతని తల్లి, భార్య గాయపడ్డారని, దాడి జరిగి వారం రోజులు అవుతున్నా... పోలీసులు కేసు నమోదు చేయకపోవడం దారుణమని అన్నారు. ముదిగుబ్బ మండలంలో కూడా దళితులు చిన్న నాగమ్మ, కుమారుడు సుదర్శనపై దాడి చేశారన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామకృష్ణ, నాగరాజు, గోపాలు, వెంకటేశులు, నారాయణ ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

ధర్మవరం, ఆగస్టు 30: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) మాత్రమే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, అంజనేయులు, అమరనారాయణరెడ్డి, హరికృష్ణ, రామ్‌ప్రసాద్, సాయిగణేష్, చంద్రశేఖర్, బిల్లే రామాంజినేయులు, జనార్ధన్, బాలాజీ, కృష్ణతేజ, నారాయణస్వామి, సురేష్ పాల్గొన్నారు.

కదిరి : యుపీఎస్‌ను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలన్నారు. అనంతరం త హసీల్దార్ మురళి క్రిష్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహ, సాంబశివ, జగన్, తాజుద్దీన్, ఎస్ఎఫ్ఐ బాబ్‌జాన్, యూటీఎఫ్ జిల్లా నాయకులు సునీల్‌కుమార్, మల్లికార్జున, ఆజాంబాషా, మండల నాయకులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నల్లమాడ : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం శనివారం నిర్వహిస్తోందని, మండలంలోని ఎర్రవంకపల్లి ఎస్సీకాలనీలో ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రారంభిస్తారని టీడీపీ మండల కన్వీనర్ షైలే శివశంకర్ శుక్రవారం తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.


ధర్మవరంలో పరిటాల రవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


గొట్లూరు అనాథాశ్రమంలో అన్నదానం


పరిటాల రవి ఘాట్ వద్ద చిగిచెర్ల నాయకుల నివాళి

బడుగుల ఆశాజ్యోతి పరిటాల రవి

● నివాళులు అర్పించిన నాయకులు ● జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు

ధర్మవరం, ఆగస్టు 30: బడుగుల ఆశాజ్యోతి స్వర్గీయ పరిటాల రవీంద్ర అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పరిటాల రవీంద్ర 67వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పరిటాల రవి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద గల అన్నక్యాంటీన్, కదిరి గేటు, ఆర్టీసీ బస్టాండ్, లక్ష్మీ చెన్న కేశవపురం, గాంధీసర్కిల్ టీడీపీ కార్యాలయం వద్ద అన్నదానం చేప ట్టారు.కార్యక్రమంలో నాయకులు చిగిచెర్ల ఓబిరెడ్డి, కమతం కాటమ య్య, పరిశే సుధాకర్, పణికుమార్, మద్దిలేటి, బీరే గోపాలక్రిష్ణ, పురు షోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, అత్తర్ రహీం, జింకల రాజన్న, గోసల శ్రీరాములు, చీమల రామాంజి, బొట్టుకిష్ట, సాయిక్రిష్ణ, బోరువెల్ మారుతీరెడ్డి, తిరుపాల్, క్లస్టర్ రామాంజి, అంకన్న, కరెంటు ఆది, పల్ల పురవి, రాఘవరెడ్డి, కేతినేని రాజ, బీరే శ్రీరాములు, టైలర్ గోపాల్, అడ్డా మహేశ్ చికెన్ రాము, మాల్యవంతం నారాయణస్వామి పాల్గొన్నారు. అలాగే వెంకటాపురంలో రవీంద్ర ఘాట్ వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్, నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి నివాళులర్పించారు.

ధర్మవరంరూరల్ : పరిటాల రవీంద్ర జయంతిని పురష్కరించుకుని టీడీపీ నాయకులు గొట్లూరు అనాథాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఇందులో టీడీపీ మాజీ కన్వీనర్ గొట్లూరు శ్రీనివాసులు, చల్లా శ్రీనివాసులు, అమరేంద్ర, కృష్ణయ్య, తిప్పయ్య, పోతలయ్య, సంగాల సూరి, కృష్ణారెడ్డి గుమ్మలకుంట, చల్లారామానాయుడు, నరిశెట్టి రామారావు పాల్గొన్నారు. అదేవిధంగా చిగిచెర్ల గ్రామానికి చెందిన మాజీ జడ్పీచైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, నాయకులు పార్థారెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రాయుడు, నాగరాజు, వెంకటేష్, అశోక్, హేమంత్, ఆనంద్ వెంకటాపురం వెళ్లి పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించారు.

బత్తలపల్లి : స్థానిక టీడీపీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీటీ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు, పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, చల్లా శ్రీనివాసులు, తాళ్లూరు సతీశ్, సురేంద్రనాయుడు, నారాయణస్వామి, రమణ, రంగారాయుడు పాల్గొన్నారు.

తాడిమర్రి: తాడిమర్రిలో టీడీపీ నాయకులు పరిటాల రవి చిత్రప టం వద్ద నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి అందరికి స్వీట్లు పంచారు. ఇందులో టీడీపీ నాయకులు కూచిరామ్మోహన్, గోనుగుంట భూషణ్, ధనుంజయనాయుడు, విశ్వనాథ్, సాయి, అశోక్, గణేశ్, వినోద్; రవీంద్రారెడ్డి, పాపానాయుడు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: స్థానిక బాలుర, బాలికల పాఠశాలల విద్యార్థులకు టీడీపీ నాయకులు స్వీట్లు పంచారు. ఇందులో నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, అశ్వర్థరెడ్డి, తుమ్మల మనోహర్, కోట్ల బాబి, గోపాల్ రెడ్డి, పతిరెడ్డి, వినోద్ బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న గోనుగుంట్ల విజయ్ కుమార్, చింతలపల్లి మహేశ్‌చౌదరి


బత్తలపల్లిలో పరిటాల రవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


తాడిమర్రిలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


ముదిగుబ్బలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

కోలాహలంగా నగర సంకీర్తన

పుట్టపర్తి, ఆగస్టు 30: జిల్లాకు చెందిన సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు, మొదటిసారి పర్తియాత్రతో వేలాదిమంది శుక్రవారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బాలవికాస్ చిన్నారులు రామాయణంలోని ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. అష్టోత్తరశత నామాంజలి పేరిట సాయినామంతో పులకరించారు. రాత్రి పట్టణవీధుల్లో నగరసంకీర్తనను సత్యమ్మ ఆలయం నుంచి గణేష్‌గేట్ వరకు నిర్వహించారు. సత్యసాయిరథాన్ని ఊరేగిస్తూ భక్తిపాటలు పాడుతూ కోలాటం ఆడుతూ పట్టణవీధుల్లో సేవాదళ్ తన్మయత్వంలో మునిగారు.


కోలాటం ఆడుతున్న భక్తులు, సత్యసాయి రథం (ఇన్‌సెట్లో)

వేధించి.. మళ్లీ వస్తారా..?

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను అడ్డుకుంటాం

హెచ్చరించిన టీడీపీ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 30: మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన మల్లికార్జున బాధ్యతలు చేపడితే అడ్డుకుంటామని టీడీపీ నాయకులు హెచ్చరిం చారు. కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఆయన.. ధర్మవరానికి పోస్టింగ్ తెచ్చుకున్నారు. శనివారం బాధ్యతలు చేపడతారని తెలుసుకున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు కొత్తపేట ఆది, ప్రసాద్ నాయుడు, అంబటి సనత్ కుమార్, మాధవ రెడ్డి శుక్రవారం స్పందిం చారు. వైసీపీ హయంలో ఆయన ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారని, అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంటకరామిరెడ్డికి అనుకూలంగా వ్యవహరించారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలువారు నామినేషన్ వేయకుండా కుట్రలు చేశారని ఆరోపించారు. టీడీపీ తరపున పోటీ చేయడానికి ముందుకు వచ్చిన అభ్యర్థులకు ఎన్‌ఓసీ ఇవ్వడానికి కూడా సహకరించలేదని అన్నారు. చివరికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ జోక్యం చేసుకోవడంతో ఎన్‌ఓసీలు ఇచ్చారని అన్నారు. ధర్మవరం కమిషనర్‌గా మూడున్నరేళ్లు పనిచేసిన ఆయన.. ప్రతిపక్షాలను ఇబ్బందులను గురిచేశారని వాపోయారు. సమస్యల పరిష్కారం కోసంవెళ్లిన టీడీపీ నాయకుల పట్ల దురుసుగా వ్యవహరించారని, ఆ సమ యంలో భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడ పనిచేస్తున్నా వదిలి పెట్టేది లేదని హెచ్చరించామని గుర్తు చేశారు. అలాంటి ది ఆయనను తిరిగి ధర్మవరానికే ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి విషయం తెలియ జేశామని, అయినా జిల్లాకు చెందిన ఓ మంత్రి అనుచరుడు ఒత్తిడి తీసుకువచ్చి మల్లికార్జునను ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు తెచ్చారని అన్నారు. వైసీపీకి వీర విధేయుడిగా ఉంటూ, తమను వేధించిన అధికారికి ఇక్కడే పోస్టింగ్ ఇవ్వడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనను అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ధర్మవరం పనిచేసిన మల్లికార్జున ఆ తరువాత గుంతకల్లుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం రిజర్వులో ఉన్న ఆయనను కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ఆ తరువాత 24 గంటలు గడవకనే ధర్మవరానికి పోస్టింగ్ తెచ్చుకున్నారు.

ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున

ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జునను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర స్పెషల్ సెక్రటరీ అనీల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ మల్లికార్జున వెకెన్సీ రిజర్వ్‌లో నుంచి ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ రామ్‌కుమార్ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.



గవర్నర్‌ను కలిసిన కదిరి ఎమ్మెల్యే



కదిరి, ఆగస్టు 30: కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రాష్ట్ర గౌవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌ను శుక్రవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని గవర్నర్‌కు ఎమ్మెల్యే వివరించారు.

పోలీసు సంక్షేమానికి కట్టుబడి ఉంటాం: ఎస్పీ

పుట్టపర్తి రూరల్: పోలీసులు, వారి కుటుంబ సంక్షేమానికి తాము కట్టు బడి ఉన్నామని ఎస్పీ రత్న పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాల యంలో పోలీసుశాఖలో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన పోలీసు కుటుంబాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ప్రభు త్వం నుంచి వారికి రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందించేలా చర్యలు తీసు కుంటామన్నారు. సిబ్బంది అన్నిరకాల సమస్యలను 15 రోజుల్లో పరిష్కారమయ్యేవిధంగా చూడాలని డీపీఓ సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఓ సుజాత, సీసీలు రాఘవేంద్ర, ఆనంద్, ఆర్‌ఐలు వలి, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


బుక్కపట్నం : బిస్కెట్లు పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ కౌసల్యసాయి


ధర్మవరం : శ్రీనివాస కళాశాలలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

పల్లె ఉమకు ఘన నివాళి

ధర్మవరం, ఆగస్టు 30: మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమ వర్ధంతిని శ్రీనివాస డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. కళాశాలలో పల్లె ఉమా చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం గొట్లూరు అనాథాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ముసల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద పల్లె ఉమ వర్ధంతిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, ఒలిపి శీన, రఘుపతి డ్రైవర్ కేశప్ప, పెద్దన్న పాల్గొన్నారు.

నల్లమాడ : మండల కేంద్రంలోని కన్వీనర్ షైలే శివశంకర్ నివాసంలో పల్లె ఉమ వర్ధంతిని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలున్నారు.

బుక్కపట్నం: స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉమ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ఎమ్మార్సీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాలు బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్య సాయి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తచెరువు, నల్లమాడలో పల్లె ఉమ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

ఆత్మహత్య కారకులను శిక్షించండి


స్టేషన్ ఎదుట.. రోడ్డుపై బైఠాయించిన బాధితులు

కొత్తచెరువు, ఆగస్టు 30 : మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురుబ శ్రీరాములు గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అతని ఆత్మహత్యకు కారణమైన కాంతమ్మ, నాగభూషణ, నరసింహుడు, ప్రసాద్, అంజనేయులును పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని శ్రీరాములు భార్య భారతి, కుటుంబ సభ్యులు, బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై శుక్రవారం బైఠాయించారు. భారతి మాట్లాడుతూ... శ్రీరాములు పాఠశాల ప్రహరీపై గడ్డిమోపు ఉంచుతుండగా.. అది పాఠశాల ఆవరణంలో పడిందని, దాన్ని తీయడానికి శ్రీరాములు ప్రహరీ దూకాడని తెలిపారు. అయితే ఆ సమయంలో అక్కడే ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న ఓ మహిళ తనను పట్టుకోవడానికి వచ్చాడంటూ కేకలు వేసిందని అన్నారు. ఆ విషయం తెలుసుకున్న ఆమె భర్త, బంధువులు శ్రీరాములు ఇంటిపైకి దాడి చేయడానికి గురువారం రాత్రి పెద్దఎత్తున వచ్చారని, దీంతో భయాందోళనకు గురైన శ్రీరాములు ఆత్మహత్య చేసుకున్నాడని వాపోయారు. కావున శ్రీరాములు చావుకు కారకులైనవారిని తక్షణమే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని భారతి కోరింది. అనంతరం సీఐ ఇందిరాకు ఫిర్యాదు చేసింది.


ధర్మవరంలో గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ఆర్టీసీ నాయకుల నిరసన

ధర్మవరం, ఆగస్టు 30: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల నెలవారి జీతంలో రావాల్సిన అలవెన్స్‌లను ట్రెజరీ అధికారులు నిలుపుదల చేయడంపై ఎన్ఎంయూ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. జోనల్ నాయకులు ప్రేమ్‌కుమార్, రీజనల్ చైర్మన్ ముత్యాలప్ప మాట్లాడుతూ... కండక్టర్లు, డ్రైవర్లకు నైట్ అవుట్ అలవెన్స్‌లను పునరుద్ధరించాలని, జీఓ నెంబర్ 114 లోని అలవెన్స్‌లను అమలు చేయాలని... డిమాండ్ చేశారు. ఈ నిరసనలో డిపో చైర్మన్, కార్యదర్శి హనుమాన్, మధు, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, హరి, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్‌సాబ్, పీఎస్‌ఖాన్, వైవీఎన్‌రెడ్డి, మోహన్, దుర్గాప్రసాద్, ఎంసీజీ రావు, నాయక్, గౌడ్, కోమలాదేవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : రాత్రి విధులకు వెళ్తున్న ఆర్టీసీ కండెక్టర్లు, డ్రైవర్లకు అలవలెన్సు పునరుద్దరించాలని ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో శుక్రవారం డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 114ను రద్దు చేశారని, దాన్ని పునరుద్దరించాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి గ్రాడ్యుటీ, ఆర్జిత సెలవులు, మెడికల్ బిల్లులు ఇవ్వడంలో ఆలస్యమవుతోందన్నారు. చనిపోయిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం దహన సంస్కారాలకు రూ.25వేలు ట్రెజరీ ద్వారా ఇవ్వాలన్నారు. సర్వీస్‌లో చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్యా నియామకాల కింద ఉద్యోగులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, నారాయణస్వామి, భైరిశెట్టి, రామచంద్ర, బాబ్‌జీ, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, రఫీక్, తిమ్మన్న, యాక్బుఖాన్ పాల్గొన్నారు.


కదిరిలో ఆందోళన చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

ధర్మవరం : శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పట్టణంలో దుర్గమ్మ ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. దుర్గమ్మతల్లిని అర్చకులు పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు అభిషేకాలు, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చి.. దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.


దీపాలు వెలిగిస్తున్న మహిళలు


అలంకరణలో దుర్గమ్మ


అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

నటనలో ఆయనకాయనే సాటి

● బాలకృష్ణ 50 ఏళ్ల సినీరంగ ప్రస్థానంపై సంబరాలు

హిందూపురం, ఆగస్టు 30: నందమూరి బాలకృష్ణ నటన అద్భుతమనీ, ఆయనకు ఆయనే సాటి అంటూ టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఆయన సినిమారంగంలో ప్రవేశించి శుక్రవారం నాటికి 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూపురంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద భారీ కేక్ కట్‌చేశారు. ఆర్ఎంఎస్ షఫీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చిలమత్తూరు మండలంలో టేకులోడు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన టీడీపీనియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర రంగంలో 50ఏళ్లు సుదీర్ఘంగా నటుడిగా కొనసాగుతున్న అరుదైన అవకాశం బాలకృష్ణకే దక్కిందన్నారు. మరోవైపు రాజకీయాల్లో కూడా తనదైన శైలిలో ముందుకెళ్తూ హిందూపురం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. టీడీపీ నాయకులు నాగరాజు, బేవనహళ్లి ఆనంద్, రామాంజినమ్మ, అమర్నాథ్, మోదాశివ, పరిమళ, ఎస్సీసెల్ వెంకటరమణ, రవీంద్రనాయుడు, కోరుముట్ల నాగేంద్ర, టైలర్ గంగాధర్, అమీన్, హనుమంతరాయుడు, ఆదినారాయణ, సూరీ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
పావగడ : ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 50ఏళ్ల సుదీర్ఘ సినీరంగ ప్రవేశ వేడుకలను, దివంగత పరిటాల రవి 67వ జయంతిని పావగడలో ఎన్టీఆర్ అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. శనీశ్వరుడి ఆలయం పక్కన పట్టణ ప్రజలకు అన్నదానం చేశారు. భవానీ ఎన్టీఆర్ తాళ్లూరు గోవిందప్ప, తరకారి కృష్ణప్ప, సుబ్రమణి, కేఆర్ గంగాధర్, మాచినేని ప్రవీణ్, వెంకట్ రాము అనిల్ బాయ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి


పరిటాల రవీంద్రకు నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ, ఆగస్టు 30: పరిటాల రవీంద్ర జయంతి వేడుకలను టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఎంపీ కార్యాలయంలో సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ అశ్వత్థనారాయణ, రవీ, సునీల్‌ఖుమార్ ఆధ్వర్యంలో పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిటాల రవీంద్ర జయంతి వేడుకలు, అధ్యాపకులు ప్రతాప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు, పంపిణీ చేశారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ

గుడిబండ, ఆగస్టు 30: మండలంలోని బైరేపల్లికి చెందిన పేద విద్యార్థిని చైత్రకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు శుక్రవారం ల్యాప్‌టాప్‌ను వితరణ చేశారు. అనంతపురం కళాశాలలో ఇంజనీరింగ్ చేస్తున్న చైత్ర ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేసేందుకు స్తోమత లేకపోవడంతో ఎమ్మెల్యేను ఆశ్రయించి విషయం తెలిపింది. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో ల్యాప్‌టాప్‌ను విద్యార్థిని అందజేశారు. కుటుంబ సభ్యులు, విద్యార్థిని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.


విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆర్బీఐ క్విజ్ పోటీల్లో పాల్గొనండి

పెనుకొండ, ఆగస్టు 30: ఆర్బీఐ స్థాపించి 90ఏళ్లు పూర్తయిన సందర్భంగా యుజీ స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని, అందులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని ఆర్థిక అక్షరాస్యత జిల్లా కోఆర్డినేటర్ వీరమారుతి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఆర్బీఐ క్విజ్ పోటీలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక పర్యావరణ వ్యవస్థపై అవగాహన కల్పించేలా సెప్టెంబరులో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ క్విజ్ పోటీలకు పోస్టరులోని బార్‌కోడ్ ద్వారా ఇద్దరు విద్యార్థులు కలిసి ఒక టీమ్‌గా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదిశేషరెడ్డి, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వెంకటేశ్, జయచంద్ర, గజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రీకౌన్సెలింగ్ నిర్వహించాలి

పెనుకొండ, ఆగస్టు 30 : ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సర్దుబాటును అసంబద్ధంగా చేపట్టారని, తిరిగి కౌన్సెలింగ్ చేపట్టి సరిదిద్దాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీవైఈఓ రంగస్వామికి అందజేశారు. ఇదివరకు కేటాయించిన స్థానాలను తప్పించి అందరికీ న్యాయం చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ నాయకులు జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి అంజినమూర్తి, హిందూపురం నాగరాజు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్ఎంసీ సభ్యులకు అవగాహన

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 30: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన స్కూల్ కమిటీకి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐఎంఎంఎస్ యాప్ నిర్వహణ గురించి వారికి అవగాహన కల్పించారు. ప్రతి వారం మంగళ, బుధవారాల్లో మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రత, కార్యక్రమాన్ని ఎలా చేపట్టాలి, దానిని యాప్‌లో ఎలా నమోదు చేయాలి అనే విషయాన్ని వివరించారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పాఠశాల నిర్వహణ, వివిధ అంశాలపై ఎంఈఓ-2 ఆనంద్‌బాబు పలు సలహాలు, సూచనలు అందించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత కమిటీపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె ఉమకు నివాళి


నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

పెనుకొండ, ఆగస్టు 30 : స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సతీమణి కీ.శే. పల్లె ఉమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అధ్యాపకులు నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ ఆదిశేషరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ ఆధ్వర్యంలో ఉమ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అశోక్, ఏఓ కేశవయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే టీడీపీ ధ్యేయం

● వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి ● 6న ఎంజేపీ పాఠశాల ప్రారంభం: మంత్రి సవిత


ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఆగస్టు 30 : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే టీడీపీ ధ్యేయమని, వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తమయ్యిందని బీసీ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాంపురం గ్రామ సమీపంలో పాఠశాల ప్రారంభ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబరు 6న మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభిస్తామన్నారు. వచ్చే యేడాది నూతన భవనాన్ని పదెకరాల్లో నిర్మిస్తామన్నారు. వెనుకబడిన జిల్లా అత్యధిక ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తక్షణం స్పందించి హాస్టల్ ఏర్పాటుకు జీఓ విడుదల చేసినట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని విద్యార్థినిల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నారాయణస్వామి, కన్వీనర్ శ్రీరాములు, సర్పంచ్ శ్రీనివాసులు, త్రివేంద్ర, రామక్రిష్ణారెడ్డి అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవిత పేర్కొన్నారు. వచ్చేనెల 3న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్రౌచర్లను విడుదల చేశారు.

ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు పరిటాల: మంత్రి

పెనుకొండ నియోజకవర్గ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు పరిటాల రవీంద్ర అని మంత్రి సవిత అభిప్రాయపడ్డారు. దివంగత నేత మాజీ మంత్రి స్వర్గీయ పరిటాల రవి జయంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మాధవనాయుడు, నారాయణస్వామి, సిద్దయ్య, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, రమణమ్మ, చంద్రకాంతమ్మ, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.


పరిటాల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి సవిత

పండగను ప్రశాంతంగా నిర్వహిద్దాం: డీఎస్పీ

హిందూపురం, ఆగస్టు 30 : వినాయక చవితి పండగను ప్రశాంతంగా నిర్వహించుకుని, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో ముగించాలని డీఎస్పీ మహేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో వినాయక మండప నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ వినాయకచవితిని ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. నిమజ్జనం రోజు ఉదయమే మండపాల నుంచి విగ్రహాలను తరలించాలన్నారు. విగ్రహాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. గణపతి మండపంవద్ద విద్యుత్ సరఫరాలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రిపూట మండపం వద్ద ముగ్గురు వలంటీర్లు కాపలాగా ఉండాలన్నారు. ముఖ్యంగా మండపాలు ఏర్పాటుచేసేవారు ఆన్‌లైన్‌లో అనుమతి పొందాలన్నారు. నిమజ్జనం రోజున విగ్రహాలు తరలించే ట్రాక్టర్లకు ఇన్సూరెన్స్ ఉండాలని, లైసెన్స్ కలిగిన డ్రైవర్లనే ట్రాక్టర్ నడపాలన్నారు. ముఖ్యంగా వినాయక నిమజ్జనం పండగకు సంబంధించి సోషల్ మీడియాలో ఎవరైనా పుకార్లు సృష్టిస్తే నమ్మకూడదన్నారు. ఉదయం 6నుంచి రాత్రి 10గంటల వరకే మైక్‌కు అనుమతి ఉంటుందన్నారు. పోలీసులు నిఘా ఉంటుందని అయితే విగ్రహాలు ఏర్పాటుచేసే నిర్వాహకులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మరీ ముఖ్యంగా నిమజ్జనం రోజు నిర్వాహకులు కోనేరువద్ద సహకరించాలన్నారు. మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొంటే చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, కరీం, జనార్దన్, ట్రాన్స్‌కో ఈఈ భూపతి, ఫైర్ అధికారి ప్రభాకర్, మునిసిపల్ ఏఈ జనార్దన్, డీటీ హారతి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు


మడకశిరలో అలంకరణలో అమ్మవారు.. గోరంట్లలో..


మడకశిర రూరల్, ఆగస్టు 30: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మహిళలు వరమహాలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్లుమర్రిఈరకేతమ్మ, కనుమ మారెమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
పావగడ: ప్రసిద్ధి గాంచిన పావగడ శనేశ్వర ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా శీతలాంబ దర్శనానికి భక్తులు పోటెత్తారు. చిత్రదుర్గం, చెళ్లకెర, దావణగిరె, ఆంధ్ర ప్రాంతం నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రావణ శనివారం స్వామి దర్శనార్థం వేలాది మంది రాత్రికే పావగడకు చేరుకున్నారు.
హిందూపురం అర్బన్ : పట్టణ పరిధిలోని నింకంపల్లిరోడ్డులో ఉన్న యల్లమ్మ దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనలు చేసి ఆకుపూజ చేశారు. అనంతరం పూలు నగలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.
గోరంట్ల: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని చౌడేశ్వరి, వాసవి ఆలయం, గుమ్మయ్యగారిపల్లి మారెమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌడేశ్వరి ఆలయంలో అర్చకులు నాగభూషణ స్వామి అర్చన, మహామంగళహారతి నిర్వహించారు.


చిలమత్తూరులో మొక్కలు నాటుతున్న టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు


హిందూపురంలో మొక్కలు ఎంఈఓ గంగప్ప


ప్రెస్‌క్లబ్‌లో మొక్కలు నాటుతున్న డీఎస్పీ మహేష్

పండుగలా వనమహోత్సవం

చిలమత్తూరు, ఆగస్టు 30: వనమహోత్సవాన్ని పండుగలా నిర్వహించారు. గ్రామగ్రామాన పచ్చదనం ప్రాముఖ్యతను వక్తలు వివరించారు. ప్రతి ఇంట్లో చెట్టు ఉంటే ఊరంతా వనంలా మారుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని హిందూపురం నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా టేకులోడు బాలికల గురుకుల పాఠశాలలో ఆయన విద్యార్థులు, టీడీపీ నాయకులతో కలిసి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు దేమకేతేపల్లి అంజినప్ప, నాగరాజుయాదవ్, బేకరీ గంగాధర్, సోమశేఖర్, బేవనహళ్లి ఆనంద్, బాలాజీ, నందీషప్ప, అశ్వత్థప్ప, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.
అగళి : పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని అగళి జడ్పీటీసీ ఉమేష్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా అందరూ మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. అనంతరం ఆయన అగళి మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జాఫర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పీడీ నారాయణస్వామి, ఉపన్యాసకుడు మంజునాథ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు భూతరాజు, బోయ కరియన్న తదితరులు ఉన్నారు.
హిందూపురం అర్బన్: ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు పెంచి సంరక్షించుకోవాలని ఎంఈఓ గంగప్ప పిలుపునిచ్చారు. వనమహోత్సంలో బాగంగా శుక్రవారం స్థానిక రహమత్‌పురం రైల్వే స్టేషన్ సమీపంలో, ఎంజీఎం, అల్‌అమీన్ పాఠశాల విద్యార్థులతో కలిసి డివైడర్‌ల మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికుడు భాస్కర్‌రెడ్డి, ఎంజీఎం హెచ్‌ఎం సామ్రాజ్యం, అల్‌అమీన్ నిర్వాహకుడు రియాజ్, పీడీ లోకనాథ్, విలియం. విద్యార్థులు పాల్గొన్నారు. చెట్టు తల్లిలా ఆదరిస్తుందని, తండ్రిలా కాపాడుతుందని హిందూపురం డీఎస్పీ మహేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన మొక్కలు నాటారు.
మడకశిరటౌన్ : మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తే అవి నీడనిచ్చి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం ముందు వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలు నాటిన అనంతరం మాట్లాడుతూ పచ్చని చెట్లను కాపాడుకుంటే సకాలంలో వర్షాలు కురుస్తాయని, ఆప్రాంతం అంతా ఎంతో ఆహ్లాదకరంగా చల్లటి గాలితో మనోల్లాసంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో కమిషనర్ రంగస్వామి, జపానందస్వామి, టీడీపీ నాయకులు జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
అమరాపురం : మండల కేంద్రంలోని మండల పరిషత్ ఆవరణంలో ఎంపీడీఓ భాస్కర్, ఉపాధి హామీసిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటి వాటిని పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఎంపీడీఓ భాస్కర్, ఉపాధి హామీ ఏఈ జగదీష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు మంజునాథ్, హెన్రీ, లావణ్య, హనుమంతరాయప్ప, గంగప్ప, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.
రొళ్ల : మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గురుకుల పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎం.సుమ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మైలారప్ప, ఏపీడీ లక్ష్మీనారాయణ, కుళ్లాయప్ప ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.


మడకశిరలో మొక్కలు నాటుతున్న టీడీపీ నాయకులు గుండుమల


అగళిలో మొక్కలు నాటుతున్న జడ్పీటీసీ ఉమేష్


రొళ్లలో మొక్కలు నాటుతున్న పాఠశాల కమిటీ ఛైర్మన్ సుమ

యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ నిరసన

పెనుకొండ, ఆగస్టు 30: యూపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తెచ్చి సీపీఎస్‌కంటే మెరుగైందని నమ్మించిందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు ఈ జీపీఎస్‌ను తిరస్కరించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కంట్రిబ్యూషన్, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. నాయకులు నారాయణస్వామి, రమేష్, ఉపేంద్ర, రవీంద్రనాథ్, క్రిష్ణనాయక్, రామాంజినేయులు, గోవిందప్ప, రాజగోపాల్, వెంకటేష్, ఆదిదినేష్ పాల్గొన్నారు.
మడకశిరటౌన్: ఏకీకృత పింఛను స్కీమ్‌ను యూపీఎస్ రద్దుచేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నిరసనలో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు మహలింగప్ప, జోగప్ప, మూడ్లగిరియప్ప, నరసింహమూర్తి, అనీల్‌కుమార్, మహంతేష్ పాల్గొన్నారు.


పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకుల నిరసన

సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

● హామీల అమలుకు సహకరించడంపై హర్షం

మడకశిరటౌన్, ఆగస్టు 30: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి మడకశిరలో పర్యటించిన సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టినందుకు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన ఆయన గుండుమల గ్రామంలో పర్యటించిన వేళ ఆయన దృష్టికి తీసుకెళ్లిన సమస్యలన్నింటిపైనా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడంపై హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంపై ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నింటికీ సానుకూలంగా స్పందించారని, తెలుగుదేశం ప్రభుత్వంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధిలో పరుగులు పెట్టబోతోందని ఎమ్మెల్యే ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు.


సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

నేడు పింఛన్ పంపిణీకి సర్వం సిద్ధం

రొళ్ల, ఆగస్టు 30 : మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారని, మండలంలోని టీడీపీ అభిమానులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మండల టీడీపీ నాయకులు కోరారు. సెప్టెంబరు 1 ఆదివారం కావడంతో ఆగస్టు 31వతేదీనే ఒక రోజు ముందు పింఛన్లు పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు గమనించాలన్నారు.
గోరంట్ల : మండలంలోని 20 పంచాయతీల పరిధిలో శనివారం నిర్వహించనున్న పింఛన్ల పంపిణీలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని మండల టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ ప్రకటనలో తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీకి సహకరించాలన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఆగస్టు 30: పట్టణంలోని రెండవ వార్డుకు చెందిన అల్ఫాజ్ ఆత్మహత్యకు యత్నించాడు. తండ్రి బాబావలీ తెలిపిన వివరాల మేరకు కుమారులిద్దరికీ ఆయన కొత్త దుస్తులు తీసుకొచ్చారు. అన్నదమ్ములిద్దరూ ఒకే డ్రస్ కోసం గొడవ పడగా, తల్లిదండ్రులు సర్దిచెప్పి చిన్నకుమారుడికి డ్రెస్ ఇప్పించారు. దీంతో పెద్దకుమారుడు అల్ఫాజ్ మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అస్వస్థతకు గురైన అల్ఫాజ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. మెరుగైనవైద్యం నిమిత్తం హిందూపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

డ్వాక్రా సొమ్ము దుర్వినియోగంపై పోలీసులకు ఫిర్యాదు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 30: మండల పరిధిలోని పత్తికుంటపల్లి గ్రామానికి సంబంధించి 'ఆదర్శ గ్రామైక్య సంఘం'గా ఉన్న 24ఎస్‌హెచ్‌జీల నగదును పక్కదారి పట్టించిన యానిమేటర్‌పై ఏపీఎం రామాంజినేయులు, ఏసీ రాంరెడ్డి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ యానిమేటర్ వివిధ సంఘాల నుంచి రూ.8.82లక్షలు వాడేసిందన్నారు. గతంలో దీనిపై ఫిర్యాదు చేయగా కొంతమేర నగదును వెనక్కు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం రూ.6.64లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై ఎస్ఐ రమేష్‌కు ఫిర్యాదు చేశామన్నారు. బాధితురాలు నెలరోజుల గడువు అడిగిందని, నెలలోపు చెల్లించకపోతే ఆమెపై చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అగళి, ఆగస్టు 30: మండలంలోని గ్యారగుండనహళ్లి గ్రామానికి చెందిన దొడ్డమూర్తి శుక్రవారం విషద్రావకం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో కర్ణాటకలోని శిరకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

పాఠశాలలో సామగ్రి చోరీ

హిందూపురం(సోమందేపల్లి),ఆగస్టు 30: మండల కేంద్రంలోని పాత హైస్కూల్‌లో ఫర్నీచర్ చోరీకి గురయ్యింది. పాతసామాన్లు దాచిన గదిలో గురువారం రాత్రి దొంగలు పలు సామాన్లను ఎత్తుకెళ్లారు. కొత్తగా నిర్మించిన భవనంలో తరగతులు నిర్వహిస్తున్న కారణంగా, పాత హైస్కూల్‌లో ఐరన్ టేబుళ్లు, ఇతర వస్తుసామాగ్రిని అలాగే వదిలేశారు. ఇది గమనించిన దొంగలు కిటికీలు తొలగించి అందులో ఉన్న ఇనుప బెంచీలు, పాత కుట్టుమిషన్లు, గేటును సైతం ఎత్తుకెళ్లారు. శుక్రవారం సంఘటన వెలుగులోకి రావడంతో ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


దొంగలు పడ్డ హైస్కూల్ ఫర్నీచర్ గది

మహిళపై దాడి చేసి నగల దోపిడీ

రొళ్ల, ఆగస్టు 30: మండలంలోని గిడ్డబొమ్మనహళ్లి గ్రామంలో మహిళ వద్ద దుండగులు నగలను దోచుకెళ్లారు. శుక్రవారం పొలం వద్ద పశువులు మేపేందుకు వెళ్లిన తిమ్మమ్మ అనే మహిళను ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనంలో వచ్చి దాడికి ప్రయత్నించారు. అనంతరం మహిళ వంటిపై ఉన్న ఆభరణాలను దోచుకెళ్లారు. ఆమె మెడలో ఉన్న బంగారు చైన్, చెవి కమ్మలను బలవంతంగా లాక్కొని వెళ్లారు. బాధితులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సేంద్రియ సాగుపై దృష్టి సారించండి

గుడిబండ, ఆగస్టు 30 : రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో సేంద్రియ ఎరువులు వాడి సాగుచేయాలని ఆర్టీడీ అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్.రాయాపురం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. రసాయనిక ఎరువులకు స్వస్తిపలికి సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు రామతమన్న, నాగేంద్రప్ప, ఇస్మాయిల్, ఉల్లిరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి బీజేపీలో చేరిక

అమరాపురం, ఆగస్టు 30: మండల బీజేపీ అధ్యక్షుడు మంజునాథ్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన దాదాపు 25 కుటుంబాలు బీజేపీలో చేరారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో వారికి మంజునాథ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.